క్లుప్తంగా

రూ. 20 వేలు అందించిన దద్దాల


ఆర్థిక సాయం అందిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని సంఘమిత్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలిగండ్ల మండలం రామగోపాలపురం ఎస్సీ కాలనీకి చెందిన తాతపుడి ఏలియా కుమార్తె తాతపుడి గ్రేస్‌ను శుక్రవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు కుప్పన బోయిన వెంకట రామయ్య, వెంకటయ్య, వెంటరెడ్డి, రాగిపిండి కృష్ణారెడ్డి, నవీన్, విక్రమ్, ప్రభుదాస్, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 20వ వార్డులో చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దీపలు శుక్రవారం పర్యటించారు. స్థానికులు నీరు, విద్యుత్, డ్రైన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తక్షణ మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావును ఆదేశించారు. అరుణోదర్, కంటు గురవయ్య, చిన్నిగారి కొండలు తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండతేనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి

పామూరు: పశ్చిమ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్నా, సాగు, తాగునీటి ఇక్కట్లు తొలగాలన్నా వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తికావడమే ఏకైక మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్.మాబూ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం సీపీఎం మండల కమిటీ సమావేశం షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగింది. బీజేపీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నోరుమెదపడంలేదన్నారు. సయ్యద్ హనీఫ్, కె.మాల్యాద్రి, సయ్యద్ గౌస్‌బాషా, ఖాసీం సాహెబ్, వీరనారాయణ, ఎం.రామయ్య, సీహెచ్.వెంకటేశ్వర్లు, శంకర్, ప్రసాద్, అల్లాబక్షు, రజియా, భానుమతి, ఖాదరున్నీసా, మదారమ్మ పాల్గొన్నారు.

ఆలయాల డిపాజిట్ల పరిశీలన

పామూరు: మండల కేంద్రమైన పామూరు శ్రీమదన వేణుగోపాలస్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల రికార్డులను శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో ఏసీ పానకాలరావు పరిశీలించారు. ఈసందర్భంగా వల్లీసమేత భుజంగేశ్వర ఆలయానికి రూ.47 లక్షలు, శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయానికి రు.12 లక్షలు మొత్తం రూ.59 లక్షల డిపాజిట్లు ఉన్నట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహ బాబు ఉన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

హనుమంతునిపాడు: బాల్య వివాహాలను అరికట్టాలని పీహెచ్‌సీ వైద్యుడు దార్ల సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీ పాఠశాల్లో బాలికలకు బంగారు బాల్యంపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్.రమణయ్య, సీహెచ్‌ఓ కేవిచెన్నయ్య, ఎస్‌ఓ అంజమ్మ పాల్గొన్నారు. **పామూరు:** బడిమానేసిన బడి పిల్లలంతా పాఠశాలకు వచ్చేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఇండ్లా హరినారాయణ అధ్యక్షతన శుక్రవారం బంగారు బాల్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ కన్వీనర్ బి.లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం పి.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల పరిశీలన

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ, శానంపూడి గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మండల ప్రజలు గత సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ అన్సారియా ఆదేశాలతో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను శుక్రవారం పరిశీలించి ఏ మేరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందో తెలుసుకునేందుకు కొలతలు కూడా తీసుకున్నారు. అక్రమ మైనింగ్ జరగకుండా అడ్డుకుంటామని, అక్రమార్కులపై భారీగా జరిమానా విధించనున్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారని స్థానికులు పేర్కొన్నారు. మైనింగ్ శాఖ ఆర్ఐ సురేష్‌బాబు, టెక్నికల్ అధికారి రాజీనాయుడు, ఆర్ఐ శివప్ప, వీఆర్‌ఓ తిరుమల, సింహాద్రి, సర్వేయర్లు సాయి, పవన్ పాల్గొన్నారు.

సమస్యల స్టాండ్!


టంగుటూరు బస్టాండ్


కొద్దిపాటి వర్షానికి బస్టాండ్ ప్రాంతంలోనికి చేరిన నీరు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా టంగుటూరు బస్టాండ్
- కనీస వసతులు కల్పించని అధికారులు
- బస్టాండ్‌లోకి చుట్టపుచూపుగా వస్తున్న బస్సులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


పెచ్చులూడిన శ్లాబ్


నిరుపయోగంగా మరుగుదొడ్లు


మూసి ఉన్న కంట్రోల్ పాయింట్


బస్టాండ్‌లో చెత్తాచెదారం

టంగుటూరు: మండల కేంద్రమైన టంగుటూరు బస్టాండ్లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి వేళలో ఎవరూ లేకపోవడంతో బస్టాండ్ ప్రాంతంలో వ్యభిచారం కూడా సాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కనీస వసతులు కరువు

బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్సుల కోసం ప్రయాణికులు వేచి చూసే సమయంలో దాహం వేస్తే బయటికి వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. తాగడానికి కనీసం మంచినీరు కూడా కరువయ్యాయి. ఆర్డినరీ బస్సుల్లో ఎక్కువ శాతం మంది పేదలే ప్రయాణిస్తూ ఉంటారు. అర లీటర్ వాటర్ బాటిల్ బయటికి వెళ్లి పది రూపాయలు పెట్టి కొనుక్కునే పరిస్థితి కూడా వారికి ఉండదు. డబ్బు లేక, దాహం తీరక అలాగే ఉంటూ బస్సు వచ్చే వరకు ఎదురుచూసి వెళ్తున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు

బస్టాండ్‌లోని మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు ఉపయోగించుకుంటే ఉన్న రోగాలకు బదులు మరిన్ని రోగాలు వస్తాయని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. మరుగుదొడ్లు ఉన్న ప్రదేశం దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్లలో సరైన నీటి సౌకర్యం కూడా లేదు. ప్రయాణికులు మరుగుదొడ్లు ఉపయోగించుకోకుండా పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తున్నారు.

తెరుచుకోని కంట్రోల్ పాయింట్

బస్టాండ్‌లోని కంట్రోల్ పాయింట్ ఎప్పుడు వెళ్లినా మూసి ఉంటోంది. తమ గ్రామానికి వెళ్లే బస్సు ఏ సమయంలో వస్తుందో, అసలు బస్సు ఉందో లేదో, ఎవరిని అడగాలో అర్థం కాక ప్రయాణికులు తికమకపడుతున్నారు. ప్రయాణికుల సేవా కేంద్రానికి ఏర్పాటుచేసిన షెల్టర్‌ను బస్టాండ్ ప్రాంతంలో ఒక మూలన పడవేశారు.

పెచ్చులూడిన శ్లాబ్

బస్టాండ్ నిర్మించి చాలా సంవత్సరాలు కావడంతో శ్లాబ్ పెచ్చులు ఊడిపోయాయి. దెబ్బతిన్న శ్లాబ్ ఎక్కడ మీద పడుతుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే చిత్తడే

వర్షం పడితే మురికినీటితో బస్టాండ్ పరిసరాలు అంతా చిత్తడిగా తయారవుతున్నాయి. నడవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి. బస్టాండ్ పరిసరాలు మొత్తం చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోందని, బయట చెత్త మొత్తం బస్టాండ్ పరిసరాల్లోనే వేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

కొన్ని బస్సులకే పరిమితం

టంగుటూరు బస్టాండ్‌లోకి అన్ని బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని బస్సులు మాత్రమే మొక్కుబడిగా వస్తుండటం, కొన్నిసార్లు బస్సుల కోసం ఎంత సమయం ఎదురు చూసినా ఫలితం లేక బొమ్మల సెంటర్ నుంచి ఆటోల్లో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. కొన్ని బస్సులు హైవే మీదే వదిలిపెట్టి వెళ్తుండటంపై ప్రయాణికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హైవేలోనే దించేశారు



నేను నా కుటుంబంతో టంగుటూరు రావడానికి కందుకూరులో బస్సు ఎక్కా. బస్సు సింగరాయకొండ బస్టాండ్‌కు వెళ్లింది. టంగుటూరు వచ్చేసరికి బస్సు బస్టాండ్‌కు వెళ్లక పోగా హైవేలోనే దించేశారు. నేను, నా భార్య, చిన్నపిల్లలను తీసుకుని లగేజీ బ్యాగులతో హైవేలో చాలా ఇబ్బందిపడ్డాం.

– బెజవాడ జగదీష్

ఆదర్శమూర్తి సావిత్రిబాయ్ పూలే


సావిత్రిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కనిగిరి: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి, ఎంపీపీ ప్రకాశం

పామూరు: మహిళల విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని గుర్తించి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించిన మహోన్నత మూర్తిని సావిత్రిబాయ్ పూలే అని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్ సెంట్రింగ్ చాంద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంబటి కొండారెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్ రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, మైనారిటీసెల్ నాయకులు షేక్ గయాజ్, గడ్డం వెంకటనారాయణరెడ్డి, బోయళ్ల మాలకొండారెడ్డి, సూరిపోగు మాల్యాద్రి, షేక్ కాలేషా పలువురు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాపూలే అని శీలంవారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య, అంబవరం హెచ్‌ఎం ఆర్.హనుమంతరావు, నల్లమడుగుల బి.డేవిడ్‌లు, కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ అన్నారు. శుక్రవారం శీలంవారిపల్లె అంబవరం, నల్లమడుగుల జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్, సీఎస్‌పురం కేజీబీవీలో జయంతి వేడుకలు నిర్వహించారు. నారిశెట్టి వెంకటరామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ అణగారి వర్గాల్లో అక్షర దీప్తి సావిత్రి బాయి పూలే అని కీర్తించారు. వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, నాయకులు కటికల వెంకట రత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సిరుప గోవర్ధన్ రెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, మహేంద్రారెడ్డి, నాగమణి, షకీలా బేగం, సుస్మిత ల్గొన్నారు.

హనుమంతునిపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం బి.సుబ్బారావు మాట్లాడుతూ స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసకం సమాజంలో సావిత్రి బాయి పూలే చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. ఉపాధ్యాయురాలు షేక్ రహణా నారాయణమ్మ, భాగ్య రేఖ, నజీరన్ బేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

కొండపి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మద్దిరాల మాధవరావు మాట్లాడుతూ పూలే అణగారిన బాలికల విద్య కోసం 50 ఏళ్లు పోరాడారన్నారు. అనంతరం గురుకులం ప్రిన్సిపాల్ అరుణను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘ నాయకులు బ్రహ్మయ్య, దన్యాసి మాల్యాద్రి, బడుగు నాగభూషణం, ఉపాధ్యాయులు, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


శీలంవారిపల్లెలో సావిత్రిబాయ్ పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


చిత్ర పటానికి పూలమాలేస్తున్న హెచ్‌ఎం.. ఉపాధ్యాయులు


ప్రిన్సిపాల్ అరుణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ


బీరువాలో ఉంచిన ఆటవస్తువులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కొండపి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం సామాజిక బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఆర్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సామాజిక తనిఖీలో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాలకు ఉపయోగించే ఆట వస్తువులను పరిశీలించామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించిందని తెలిపారు. లైబ్రరీలోని పుస్తకాలు సక్రమంగానే ఉన్నాయన్నారు. పాఠశాలకు కేటాయించిన ఆట వస్తువులు, వినియోగించకుండా బీరువాలోనే ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకానందున శనివారం మరోసారి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులు హాజరుకావాలి

గురుకుల పాఠశాలలో శనివారం సామాజిక తనిఖీ బృందం నిర్వహించే సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ అరుణ కోరారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలు, సౌకర్యాలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తనిఖీ బృందానికి తెలియజేయాలని స్పష్టం చేశారు.

వాటర్ ప్లాంటా.. పశువుల కొస్టమా?


వాటర్‌ప్లాంటులో పశువులను మేపుతున్న దృశ్యం

సింగరాయకొండ: వాటర్‌ప్లాంటుకు మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పాతసింగరాయకొండ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గతంలో జీవీఆర్ ఆక్వా కంపెనీ సహకారంతో వాటర్‌ప్లాంటు నిర్మించి గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైతే పంచాయతీ నిధులతో బాగు చేసి సమస్య పరిష్కరించారు. వాటర్ ప్లాంట్ ఇటీవల మరమ్మతులకు గురైతే పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వాటర్‌ప్లాంటులో పశువులను మేపుకొంటున్నారని, ఇదెక్కడి చోద్యమని పంచాయతీ అధికారుల పనితీరును గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పేడదిబ్బలతో అపరిశుభ్రంగా మారిన వాటర్‌ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా ప్లాంటుతో పంచాయతీకి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. గతంలో ప్లాంటు మరమ్మతులకు పంచాయతీ నిధులు వినియోగించారో లేదో తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఈఓఆర్డీ సుధాకర్‌ను వివరణ కోరగా వాటర్‌ప్లాంటుతో పంచాయతీకి సంబంధం లేదని కార్యదర్శి చెప్పారన్నారు.

బెదిరింపులకు పాల్పడటం హేయం


వార్డు సభ్యురాలిని పార్టీలోకి చేర్చుకుంటున్న ఇన్‌చార్జ్ దద్దాల

పామూరు: వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులను టీడీపీవారు బెదిరింపుధోరణికి పాల్పడి టీడీపీలో చేర్చుకోవడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీ నాయకులు బెదిరింపులకు తలొగ్గి టీడీపీలో చేరి తిరిగి వైఎస్సార్ సీపీలోకి వస్తామన్న పామూరు మండలం కంభాలదిన్నె గ్రామ పంచాయతీ 3 వార్డు సభ్యురాలు నీలం కొండమ్మ, భర్త రామయ్యలను గ్రామ నాయకుల సమక్షంలో ఇన్‌చార్జ్ దద్దాల వారికి పార్టీ కండువావేసి వైఎస్సార్ సీపీలో చేర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ పేదలపార్టీ అని ఎప్పుడూ వారికి అండగా ఉంటుందన్నారు. ఈసందర్భంగా పార్టీలో తిరిగి చేరిన వార్డు సభ్యులురాలు నీలం కొండమ్మ మాట్లాడుతూ తనను టీడీపీలో చేరాలని లేకపోతే నీభర్త నీలం రామయ్యకు వస్తున్న పెన్షన్ నిలిపివేయిస్తామని టీడీపీ నాయకులు తనపై ఒత్తిడి తెచ్చారన్నారు. దీనికి భయపడి తాము గత నెల 20న విధిలేని పరిస్థితుల్లో టీడీపీలో చేరామన్నారు. కాగా టీడీపీ కండువా వేసుకున్న నాటి నుంచి తమ మనస్సు బాగలేదని, మనోవేదన చెంది తిరిగి వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నామన్నారు. దీంతో గ్రామానికి చెందిన నాయకులు కొల్లా రమణయ్య, నక్కా మాల్యాద్రి, నీలం శ్రీరాములు, నీలం వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ వద్ద పార్టీలో తిరిగి చేరినట్లు, పార్టీ బలోపేతంకోసం తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: హెల్మెట్ ప్రాణానికి భద్రతను ఇస్తుందని ఎస్సై ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. కొండపిలోని స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. పెండింగ్ చలానాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధ్రువీకరణ పత్రాలు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్సై అంకారావు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 6 వేల రూపాయల విలువైన క్రీడా దుస్తులను హెచ్‌ఎం బహూకరించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచి పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: మండలంలో శనివారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నందున ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని ఎంపీడీఓ రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై జరుగుతున్న సామాజిక తనిఖీలో ప్రతి ఆధారాన్ని రికార్డు పూర్వకంగా అందించాలని, సహకరించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, పీఆర్ ఏఈ ప్రసాద్, ఎస్‌ఆర్పీ వెంకటేశ్వర్లు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎంపీ వైవీకి శుభాకాంక్షలు తెలిపిన ఆదిమూలపు సురేష్


వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న సురేష్

సింగరాయకొండ: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వైవీకి వివరించారు.

6న షెడ్యూల్ కులాల ఫిర్యాదుల స్వీకరణ

మద్దిపాడు: మండలంలోని షెడ్యూల్ కులాలకు చెందిన వ్యక్తుల నుంచి ఈ నెల 6 తేదీన ఒంగోలులోని స్పందన మీటింగ్ హాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తారని తహసీల్దార్ జ్వాలా నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ చైర్మన్‌గా నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజాన్ మిశ్రా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ విషయమై ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇచ్చే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఘర్షణపై కేసులు నమోదు

లింగసముద్రం: మండలంలోని రాళ్లపాడు గ్రామంలో పొగాకు బ్యారన్‌ల స్థలాల వివాదంలో తలెత్తిన ఘర్షణలో రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మహమ్మద్ సుభాని శుక్రవారం తెలిపారు. వారం రోజుల క్రితం రాళ్లపాడు గ్రామంలో పొగాకు బ్యారన్‌ల వద్ద ఉన్న స్థలం విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో వైఎస్సార్ సీపీకి కెందిన ముగ్గురికి, టీడీపీకి చెందిన ఒకరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు వెళ్లారు. అక్కడ రెండు వర్గాలవారు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీకి చెందిన డేగా మాల్యాద్రి ఇచ్చిన ఫిర్యాదులో టీడీపీకి చెందిన మద్దెల మోహనరావు, ఇనకొల్లు బానుచందర్, గొల్లపల్లి కిషన్, మద్దెల రామక్రిష్ణయ్యలపై కేసు నమోదు చేశారు. కాగా టీడీపీకి చెందిన ఇనకొల్లు భానుచందర్ ఇచ్చిన ఫిర్యాదులో డేగా మాల్యాద్రి, డేగా నరశింహం, గోగుల మాల్యాద్రి, డేగా మహేంద్రలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.